# విషాదం

"నువ్వు, గొప్ప విషాదాంతాలు కాదగిన కథల్లో, హాస్య సంఘటనల్ని కల్పించి, అపసవ్యంగా రాసేస్తున్నావ్. కథకుడుగా నువ్వు ఫెయిల్యూర్. కవిత్వం రాసేందుకు ఎందుకు ప్రయత్నించ కూడదు?"

మిత్రుడు మాధవరావు రాసిన వుత్తరంలోని యీ మాటలు, నా మనసులో పెద్ద మథన పుట్టించినై. ఆ పగలల్లా ఆ మాటల్ని గురించి అదేపనిగా ఆలోచించాను. ఆ రాత్రి రెండో ఆట సినిమా చూసి వస్తుండగా పార్కు దగ్గర ఎదురైన కాంతారావు కూడా అదే ధోరణిలో మాట్లాడాడు.

"సినిమా నుంచేనా?"

"ఊఁ" – అన్నాడు ఆలోచిస్తో.

"సినిమా కథలంటే అలా వుండాలి! భగ్నప్రేమ ఆ హీరో – హీరోయిన్లనే కాక వాళ్లంటే గౌరవించే, ప్రేమించే మరిద్దరు స్నేహితుల్ని కూడా బలిగొన్నది. చూడు! ఎంత విషాదమో! అది చూసి వారం రోజులైనా యిప్పటికీ తలచుకుంటే కళ్లల్లో నీళ్లు తిరుగుతై. నువ్వు కూడా అలాంటి విషాదాంతాలు ఎందుకు రాయకూడదు? మన బతుకులు విషాదాలూ, విషాదాంతాలూ కాక మరేముంది?"

కాంతారావు ఆ మాటలు అన్నంత సేపూ, నా కళ్లల్లోకి పరీక్షగా గుచ్చి గుచ్చి వాడిగా చూశాడు. బహుశా నా కళ్లల్లో ఏ ఒక్క నీటిబిందువైనా కదలకపోతుందా అని అతడి ఆశ కావొచ్చు.

నేను ఏ జవాబూ చెప్పకుండా రెండడుగులేసి, కంటిలో హఠాత్తుగా ఏదో నలక పడగా, 'హు' – అంటూ కళ్లజోడు తీసి, వేళ్లతో కన్ను నలపసాగాను. కాంతారావు సానుభూతిగా గొంతు సన్నగా మార్చి, మాటల్ని నొక్కుతూ తడబడుతూ అన్నాడు.

"అవును! తలచుకుంటే మన కళ్లు చెమ్మగిల్లుతై. ప్రపంచమంతా ఓ విషాద సముద్రం. నిన్నూ – నన్నూ, మనుషులందర్నీ కలిపి పట్టుకుని, తేల్చేది, ముంచేదీ కూడా అదే! చూడు – నీ జీవితం, నా జీవితం – కృష్ణమూర్తీ, నాగేంద్రం, బసవయ్యా, అప్పారావూ...."

నాకు విసుగూ, భయం కూడా కలిగింది. ఎందుకనో ఆ సమయంలో ఒంటరిగా వుండాలనీ, మంచం మీద వెల్లకిలా పడుకుని, యింటి కప్పులోకి చూస్తూ సిగరెట్ కాల్చుకోవాలనీ అనిపించింది.

"రేపు మాట్లాడదాం. నిదరొస్తోంది" – అన్నాను.

కాంతారావు ఆప్యాయంగా నా భుజం మీద చేయివేసి, ఏదో అనబోయాడు.

ఆ చేతి స్పర్శ నాకు మంచుగడ్డ తగిలినంత వేడీ, తిమ్మిరీ కలిగించింది. కొంత విసురుగానే అతడి చేయి తీసేసి, "వస్తాను. రేపు మాట్లాడదాం" అన్నాను.

"అవును, జీవితానికి సరైన పేరు విషాదం! నిన్ను గురించే ఆలోచించుకో...." –

నేను ఆపైన వినకుండా చకచకా అక్కడి నుంచి నడిచాను. కాని, దారి పొడుగునా, యిల్లు చేరుకునే వరకూ ఆ 'నిన్ను గురించే...' – అన్న మాటలు నా చెవుల్లో కంపరం పుట్టించినై.

మంచం మీద పడుకున్నాడు. సిగరెట్ ముట్టించాను. ఏవేవో కమ్మని, తీయని వూహల్లోకి జారుకునేందుకు ఎంతో ప్రయత్నించాను. క్రాస్‌వర్డ్ పజిల్‌లో యీసారి నా ఎంట్రీ ఆల్ కరెక్టు అవుతుందనీ, వుదయం హోటల్లో క్యాష్ దగ్గిరనే ఎరిగివున్న రామారావే వుంటాడనీ, శ్రీలక్ష్మి బయటికి అనకపోయినా, లోపల్లోపల నన్నే ప్రేమిస్తోందనీ – యింకా యిలాంటి అనేకమైన తీయని వూహల్తో మనస్సును నింపుకోవాలని పట్టుదలగా ప్రయత్నించాను. కాని ఏదో, ఏదేదో – నాకు స్పష్టం కాని బాధా, దిగులూ క్రీనీడలా కళ్ల ముందు కదలసాగింది. నా హృదయం కొంచెం కొంచెంగా బరువెక్కి, నా వుచ్ఛ్వాస నిశ్వాసాల్ని అరికట్టసాగింది. నేనాలోచించడం మానేసిన – బహుశా మర్చిపోయేందుకు ప్రయత్నించిన *'నా గురించి'* – ఆ నిమిషంలో ఆలోచించసాగాను.

ఎంతో కాలం కిందట మద్రాసులో బతుకు తెరువుకు రిక్షా లాగుదామా అన్న ఆలోచన రావడం, అంతలోనే కళ్లజోడు గుర్తుకొచ్చి, 'కళ్లజోడు పెట్టుకొని రిక్షా లాగడం... ఆహాఁ' – అనుకుంటూ నాలో నేనే నవ్వుకోవడం – ఆ దృశ్యం స్పష్టంగా నా మనోనేత్రాల ముందు కదుల్లాడింది. ఔరంగబాద్‌లో అదే బతుకు తెరువు సమస్య ఎదురై కూలికి వెళదామా అనుకుని, అందుకు అవసరమైన చిరిగిన చొక్కా, పెట్టె అంతా వెతికినా కనబడక నాలో నేను నవ్వుకున్నాను. అలాగే అనేక ప్రదేశాల్లో, అనేక సమస్యల్లో, అనేక విషాదాల మధ్య కూడా, ఏదో హాస్యానికీ, నవ్వుకునేందుకూ ఏదో ఒక కారణం, సంఘటనా నాకు ఎదురౌతూనే వుండేది.

బహుశా అది నాకు తెలీకుండానే నా శరీరంలో జీర్ణించిపోయి వుండొచ్చు. నా మనస్సులో గూడుకట్టుకుని స్థిరపడి వుండొచ్చు. అది నా ప్రవర్తనలో, నా మాటల్లో, కథల్లో సర్వత్రా వ్యాపించి, మాధవరావుకీ, కాంతారావుకీ – యింకా నే ఎరిగివున్న చాలామందికి హాస్యాస్పదంగా కనబడొచ్చు.

'అయితే నన్నంటి విషాదచ్ఛాయలే లేవా? అపజయాలకీ, బాధలకీ నా మనస్సులో చోటులేదా?' – మంచం మీంచి లేచి, కిటికీ ముందు నుంచుని, దూరంగా అస్తమిస్తోన్న చంద్రుణ్నీ, మినుకు మినుకుమనే నక్షత్రాల్నీ చూస్తూ, నన్ను నేనే నిలదీసి ప్రశ్నించుకున్నాను.

చంద్రుడు ఎదురుగా వున్న పెద్ద చింతచెట్టు గుబురు చీకట్లోకి జారిపోయాడు, చెట్టు నాశ్రయించుకుని బతికే కొంగలూ, చింతుక్కులూ కలవరపాటుగా గొంతులెత్తి రకరకాలుగా అరిచినై. ఆ అరుపుల్ని అధిగమించిన ఓ వికృత ధ్వని నా చెవుల్ని తాకింది. నేను వులిక్కి పడ్డాను. కిటికీలోంచి చల్లని గాలి తీవ్రంగా నన్ను తాకింది. పెద్ద రెక్కల్ని టపటప లాడిస్తూ కిటికీ ముందు వికృతంగా అరిచి, ఓ గుడ్లగూబ దూరంగా చీకట్లో కలిసిపోయింది.

నా వొళ్లు జలదరించింది. నా జీవితమంతా ఓ పీడకలలా, ఓ విషాద నాటకంలా తోచింది. యిక నా గురించి నేను ఆలోచించుకోలేకపోయాను. మంచం మీద కూర్చుని నా స్నేహితుల జీవితాల్ని గురించి ఆలోచించసాగాను. అందరి జీవితాలూ విషాదంతో కొట్టుమిట్టాడుతున్నట్టే కనబడినయ్. ముఖ్యంగా విశ్వనాథం బతుకు...

తెల్ల కాయితాల కట్ట డ్రాయరులోంచి లాగి, కలం నిండా సిరా పోసి రాసేందుకు వుక్రమించాను. మాధవరావూ, కాంతారావూ యీ కథ చదివి ఏమనుకుంటారో! అసలు ఇది కథ కాదు - యదార్ధ జీవితం. ఆది నుంచి అంతం వరకు (విశ్వనాథం యింకా బతికివున్నాడని నాకు నమ్మకం లేదు) అతి కారు నల్లని కటిక విషాదం. యిందులో హాస్యానికీ, హఠాత్ సంఘటనలకీ తావు లేదు. మేకపోతు పుట్టి పెరిగి, వధ్యస్థానాన్నుంచి, కటిక దుకాణంలో మాంసం రూపంగా వచ్చేవరకూ, జీవితాన్ని ఎంత సాఫీగా సాగిస్తుందో - అలాంటి విషాదాంత జీవితం.

ఆ రోజుల్లో, యిప్పటికి సంవత్సరంన్నర కిందట గుంటూరు పొగాకు కంపెనీలో గుమాస్తాగిరీ చేస్తూండే వాడిని. అక్కడే నాకు విశ్వనాథంతో పరిచయయింది.

అతడు నాతోటి గుమస్తా. పరిచయమైన కొద్దికాలానికే ప్రాణమిత్రులమైపోయాం. మా యిద్దరి మధ్యా ఏ రహస్యాలూ వుండేవి కావు - అలా అని ఆ రోజు సాయంత్రం వరకూ అనుకున్నాను.

ఆ సాయంత్రం పని నుంచి రాగానే స్నానంచేసి, ఏదో చదువుతూ గదిలో కూర్చున్నాను. గబగబా తలుపు తోసుకుని విశ్వనాథం గదిలోకి వచ్చాడు. తలెత్తి చూశాను. అతని మొహం, ఏదో విషాదాన్నీ, బాధనీ కప్పుకున్నట్టుగా కనబడింది. పుస్తకం పక్కన పెడుతూ పలకరించాను.

"ఏమిటీ విశేషం?"

విశ్వనాథం తల వంచుకుని మాట్టాడకుండా వచ్చి, నా పక్కన చాప మీద కూర్చున్నాడు.

నేనూ ఓ నిమిషం వూరుకుని - "ఏమిటీ....ఆఁ" - అన్నాను.

విశ్వనాథం దిగులుగా నా కళ్లల్లోకి చూసి, చప్పున తల వంచుకుని కాలిమడమతో చాపని గట్టిగా రాస్తూ, చిన్నగా దగ్గాడు.

"మేనేజర్‌తో ఏమైనా తగూ అయిందా?" - అడిగాను.

విశ్వనాథం ఓ క్షణకాలం బార్లా తెరిచి వున్న తలుపువైపుకు చూసి, లేచి తలుపు గడి వేసి వస్తూ ప్రారంభించాడు.

"నీ సహాయం కావాలి!"

"ఏ విషయంలో?"

మళ్లీ విశ్వనాథం తల వొంచుకున్నాడు. నిశ్శబ్దంగా ఓ నిమిష కాలం గడిచిపోయింది. హఠాత్తుగా తలఎత్తి, జాలిగా నా కళ్లల్లోకి చూస్తూ, "నన్ను అపార్థం చేసుకోవనుకుంటాను!" అన్నాడు.

"అసలు విషయం రానివ్వు"

"నేను దమయంతిని ప్రేమిస్తున్నాను" అన్నాడు నిండుగా-

నాకు నవ్వూ రాలేదు - ఆశ్చర్యమూ కలగలేదు. ఇది అతి సామాన్య విషయంగానే తోచింది.

యిరవై ఏళ్లు దాటిన ఏ జీవి ఎవళ్లనో ఒకళ్లని ప్రేమించక వుండలేదని నాకు తెలుసు. అందుకే, మామూలుగానే అన్నాను.

"ఆమెను ప్రేమించడంలో అపార్థం చేసుకునేందుకేముంది? నేనూ మన దొరగారి రెండో కూతురు వైలెట్‌ని ప్రేమించాను. ఏనాడూ పలకరించే అవకాశమే నాక్కలగ లేదనుకో. ఆమె నెలక్రితమే ఇంగ్లండ్ వెళ్లిపోయింది"

విశ్వనాథం మొహం చిట్లించాడు. చిన్నగా దగ్గి, ఒకటీ రెండు గుటకలు మింగాడు.

"నా ప్రేమ అలాంటిది కాదు - దమయంతిని వివాహం చేసుకోదలచుకున్నాను" - అన్నాడు.

ఆ మాటలు నిజంగా నాకు ఆశ్చర్యం కలిగించినై. మనకు నచ్చిన వాళ్లని ఎవరినైనా ప్రేమించే హక్కు మన కుండవొచ్చు. కాని దాన్ని ఆచరణలో పెట్టేందుకు అవతలి పరిస్థితుల్నీ, హెచ్చుతగ్గుల్నీ చూడకపోవడం ప్రమాదకరమే గదా!

"దమయంతిని నువ్వు వివాహం చేసుకోబోతున్నావా?" - అన్నాను.

"వివాహం చేసుకోబోవడంలేదు - చేసుకోవాలని వుంది. అందుకు నీ సహాయం...." - ఆపైన మెల్లిగా ఏదో అన్నాడు.

"ఆమె యింటర్ చదువుతోంది గదా?"

"అవును."

"పెద్ద ఆస్తి కూడా వున్నట్టుంది"

"నిజమే"

"మరి..." - నా నోటి నుంచి మరి మాట పెగలలేదు. అన్నీ తెలిసివుండీ - విశ్వనాథం...

"ప్రేమకు ఆస్తీ, విద్యలూ అడ్డం కాదు. నా కంటే నీకు ఎక్కువ పరిచయం గనక... నీ సహాయం కావాలి"

నేను వెంటనే జవాబివ్వలేకపోయాను. విశ్వనాథం నిజంగా అంటున్నాడో, ఏదో తమాషా చెయ్యాలని ప్రయత్నిస్తున్నాడో నా కర్థం కాలేదు.

"దమయంతి నా భార్య కానప్పుడు, యిక నేను బతికి ప్రయోజనం లేదు. నువ్వేమాత్రం ప్రయత్నించినా కార్య సాఫల్యం అవుతుంది. అది నా విశ్వాసం"

విశ్వనాథం ప్రార్థించే ధోరణిలో యీ మాటలు అని మెదలకుండా వూరుకున్నాడు.

నేను అన్ని ఆలోచనల్నీ మాని విస్తుపోయి అతడి వంక చూస్తూ వుండిపోయాను.

"యీ మాత్రం సహాయం చేయలేవా?"

"సహాయమా! ఏం సహాయం?"

"యిందాకట్నించీ చెప్పింది..."

"నీకు మతిపోయింది. నాకూ మతిపోతోంది" - అన్నాను విసుగ్గా.

"అంటే నేను దమయంతికి తగననా నీ వుద్దేశం?" - అన్నాడు విశ్వనాథం కటువుగా.

అతడి గొంతులో రోషం, బిగించిన పెదాల్లో పట్టుదలా కనబడినై.

"యిక్కడ తగడం - తగక బోవడం అనేది సమస్యే కాదు. ఆ మాటకొస్తే డాక్టరు శకుంతల భర్త కన్న, నువ్వు అందమైన వాడివి. అట్లని ఆమెను నీకు భార్య కమ్మని అడగలేవు"

"ముందే అనుకున్నాను! నువ్వు అపార్థం చేసుకుంటున్నావ్! దమయంతి వివాహిత కాదు - కన్య"

"కావొచ్చు. ఆర్థికంగా వున్న హెచ్చుతగ్గులూ, చదువు, యింకా..."

విశ్వనాథం విసుగ్గా చేతులు గాలిలోకి వూపాడు. చాపని గట్టిగా రెండు కాళ్లతో తన్నాడు. నా మొహంలోకి తీక్షణంగా చూశాడు. పెద్దగా - అరిచినంత పెద్దగా అన్నాడు.

"ముందే చెప్పాను. ప్రేమ ముందు యివన్నీ లెక్కలోకి రావని. ఆమెను గాఢంగా ప్రేమించాను. ఆ ప్రేమే నన్ను కవిత్వం రాసేట్టు ప్రోత్సహించింది.

కై-నీకై-నీ కొరకై.

నా ప్రేమ కబంధ హస్తాలుచాచి

నిను నాలో - లోలో....

అంటూ ప్రారంభమైన గేయమంతా ఆమెను గురించే! నేనేనాడూ కవిత్వం రాయగలనని అనుకోలేదు. నా అంతరాంతరాళాల్ని ఆమె పెకలించింది - వెలుగులోకి తెచ్చింది"

నాకు విసుగెత్తింది. అతడి మాటల ధోరణి కలత పెట్టింది. మౌనంగా వూరుకున్నాను.

"సహాయం చేయవా?" - అన్నాడు.

"మన వీపులు చెడతై" - అన్నాను.

"సరే! తెల్లవారి నా శవాన్ని చూసి దుఃఖిస్తావు. అది నాకు తెలుసు! మాటమాత్రం మిత్రుడుకి సహాయం చేయలేకపోయానే అని విలపిస్తావ్. అంతా అయిపోయిన తరువాత - విచారించడం మానవ ప్రకృతి, వస్తాను"

విశ్వనాథం లేచి తలుపు గడితీసే వరకూ, నేను నిశ్చేష్టుణ్నిగా వుండిపోయాను. గడి తీసిన శబ్దం నన్ను వీపు తట్టి లేపినట్టయింది. పరుగెత్తి వెళ్లి అతడి భుజం పట్టుకుని తిరిగి చాప మీద కూచోపెట్టాను.

"మనం ఏ వుద్రేకాలూ, వికారాలూ లేకుండా సూటిగా మాట్లాడుకుందాం"

"నేను యిందాకటి నుంచీ అలాగే మాట్లాడాను. నువ్వే..."

నేను మాట మధ్యలోనే అడ్డుపడ్డాను.

"నువ్వు దమయంతిని ప్రేమిస్తున్నావ్. అంతేకాదు - దాన్ని బయటపెట్టి ఆమెను వివాహం చేసుకోవాలనుకుంటున్నావ్. అంతేనా?" - సూటిగా ప్రశ్నించాను.

"అంతే! కాని నువ్వు మళ్లీ మొదటికి వస్తున్నావ్" - విశ్వనాథం నిరాశగా, లాభంలేదన్నట్టు చప్పరించాడు.

"మన వూహల్నీ, కలల్నీ యదార్థాలుగా మార్చుకోలేం. నువ్వు యాభై రూపాయిల గుమస్తావి. ఆమె యింటర్ చదువుతోంది. మంచి ఆస్థి కూడా వుంది. అన్నిటికంటే - అందం, యౌవ్వనం

కూడా వున్నాయ్"

"నువ్వు మాటమాత్రం సహాయం చేస్తే అవుతుంది. గుమస్తాగా నేను ఆమెను కోరడంలేదు. కవిగా, ఆమెను హృదయాధిదేవతగా పూజించే వ్యక్తిగా అడుగుతున్నాను"

నేను సంకటంలో పడ్డానని గ్రహించాను. ప్రేమ గుడ్డిదని నాకు తెలుసు. కాని బుద్ధిలేంది కూడా అని ఆ నిమిషంలో గ్రహించాను.

"నేను అడుగుతాను. నిరాకరిస్తే?"

విశ్వనాథం ఓ రెండు మూడు క్షణాలు వూరుకున్నాడు. చప్పున నా మొహంలోకి చూస్తూ వుద్రేకంగా అన్నాడు.

"నిరాకరించదు. నిరాకరిస్తే... తరువాత...తరువాత యీ జీవితాన్ని ఎలా ముగించాలో నాకు తెలుసు"

నేను చాలాసేపు మాట్టాడకుండా వూరుకున్నాను. వ్యవహారం గడ్డుగా తయారైందని గ్రహించాను. ఎటుపోయినా ప్రమాదంగానే కనబడింది. ఆ మాట అడిగేందుకు నేను నిరాకరించినా, ఆ మాటను ఆమె నిరాకరించినా తరువాత...

మరుసటి రోజునే దమయంతిని కలుసుకుని యీ వ్యవహారం తేలుస్తానని విశ్వనాథాన్ని యింటికి పంపాను. నాకు మాత్రం భయం భయంగానే వుంది. అసలు ఆమెతో యీ సంభాషణ ఎలా ప్రారంభించాలి?

మరసటి రోజు సాయంత్రం నేను దమయంతి వాళ్ల యింటికెళ్ళినప్పుడు – ఆమె ఒక్కర్తే వుంది. తల్లి యింట్లో పనిచేసుకొంటోంది. తండ్రి బజారు నుంచి రాలేదు. ఆ మాటా యీ మాటా మాట్లాడి మెల్లిగా రంగంలోకి దిగాను –

"విశ్వనాథం కవిత్వం రాస్తున్నాడు"

"ఆc! ఆc! ఆc! మీ స్నేహితుడు! చూశాను. ఫరవాలే, మంచి కవి అయ్యే లక్షణాలే వున్నయ్"

దమయంతి మాటలు నాలో ఆశను రగుల్కొల్పినై. కొంపదీసి, యీమే అతణ్ని ప్రేమించడం లేదుగదా అన్న అనుమానం కూడా కలిగింది.

"ప్రేమ దాహంతో బాధపడే వాళ్లే అలా రాయగలరు"

ఎంత తెలివిగా మాట్లాడాను అనిపించింది.

దమయంతి పెదాలు కదలకుండానే నవ్వింది. ఎడమ కన్ను కొద్దిగా చిట్లించింది. జడను చేతిలోకి తీసుకుని రిబ్బను విప్పి మళ్లీ ముడి వేసింది. తల కొంచెం వంచి, మెడ పక్కగా తిప్పి అడిగింది.

"ఎవర్ని గురించి ఆ ప్రేమదాహం?"

నేను గతుక్కుమన్నాను. సంభాషణ యింత సాఫీగా, అవసరమైన మార్గాన నడుస్తుందని అనుకోలేదు. నాలో విశ్వాసం వెల్లివిరిసింది. జంకూ భయమూ పక్కకు తప్పుకున్నయ్.

"చెప్పమన్నారా? మీకు కోపం రాదుగదా?"

"యిందులో నాకు కోపం వచ్చేదేముంది? మీరు స్నేహితులు. ఆయనా యింతో అంతో స్నేహితుడే గదా!"

ప్రయత్నం లేకుండానే, బహుశా నా ప్రయత్నానికి వ్యతిరేకంగానేమో, నాలో నుంచి చప్పున మాట బయటికి దొర్లింది.

"మిమ్మల్ని గురించే!"

దమయంతి తక్కున లేచి నిలబడింది. ఎర్రని లిప్‌స్టిక్ పెదాల మీద, తెల్లని పలువరుసను బలంగా గుచ్చి, ముక్కుపుటాలు ఎగరేస్తూ, కళ్లు గుండ్రంగా పైకీ, పక్కలకూ తిప్పింది.

"ఛీ! మీరింత నీచులనుకోలేదు" – అంది.

"నేనా?" – నా శరీరం జలదరించి కాళ్లు వణికినై. లేచి నుంచున్నాను.

"మీరు...మీ స్నేహితుడూ కూడా"

నేనేమీ మాట్లాడలేదు. అలాగే నిలుచుండి పోయాను. ఏమనాలో తోచలేదు.

దమయంతి పెద్దగానే అనసాగింది.

"నన్నింత అవమాన పరుస్తారనుకోలేదు. మీ దృష్టిలో యింత చులకన అయ్యానా! బియస్.సి ఆనర్సు చదివిన నారాయణరావును తిరస్కరించాను. ఫిలాసఫీ యం. ఏ. ప్రసాద్‌ను నిరాకరించాను. యింకా ఎంత మంది...ఎంతమంది!! కాని... మీరు... మీరు – యాభై రూపాయిల గుమస్తాలు – ఆః!..."

నేను ఎలా వచ్చానో, మొత్తం మీద రోడ్డు మీదకు వచ్చాను. తిరిగి చూడకుండా రూము వరకూ చేరాను. అక్కడ రూము ముందు విశ్వనాథం ప్రత్యక్షమయ్యాడు.

అతణ్ని చూడగానే నా వొళ్లు భగ్గున మండింది.

"ఏమైంది? మాట్లాడావా?"

విశ్వనాథం ఎదురుగా వచ్చి ప్రశ్నించాడు. నేనేమీ మాట్లాడకుండా రూము తాళంతీసి, లోపలికి వెళ్లాను. అవమానాన్ని మింగుతూ, కోపాన్ని తొక్కిపట్టి టకటక చెప్పేశాను.

"దమయంతి నిరాకరించింది. అంతే కాదు – అనరాని మాటలు కూడా అంది. నువ్వు వారం రోజుల వరకు కనబడొద్దు. యిప్పుడు ఏమీ నోరు కదపడం నీకు క్షేమం కాదు. బయటికి...ఊ!"

విశ్వనాథాన్ని భుజం పట్టుకొని రూము నుంచి బయటికి నెట్టి లోపల గడి వేసుకుని, మంచం మీద నిలువునా పడుకుని కళ్లు మూసుకున్నాను.

తరవాత నాలుగు రోజుల వరకూ పనికి వెళ్ళలేదు.

ఈ కాలంలో విశ్వనాథం బతుకు విషాదంగా పరిణమించి పోయింది. పిచ్చివాడులా వూరంతా రాత్రింబవళ్లు తిరిగాడు. రోడ్డు పక్కనా, తూముల మీదా ఎక్కడ పడితే అక్కడ పడి నిద్రపోయేవాడు. ఘోరమైన కారు విషాద కవిత్వం రాసి, పాడుకుంటూ పిచ్చివాడై పోయాడు.

నేను తిరిగి పనిలోకి వెళ్లసాగాక రెండు మూడు మార్లు రోడ్డు మీద ఎదురయ్యాడు. కాని నన్ను గుర్తించినట్టే కనబడలేదు. మాసిన తలా, పెరిగిన గడ్డం, చిరిగి పీలికలైన చొక్కా, అంగ

వస్త్రంగా కూడా పనికిరాని కట్టుపంచా - చాలా దీనంగా కనిపించాడు.

తరవాత నెల రోజులకు గుంటూరే వదిలేశాడు. నెల్లూరులో కనిపించాడని ఒకరిద్దరు ఆ తరవాత చెప్పారు. నేనక్కడి నుంచి యిటు ట్రాన్స్‌ఫరై వచ్చాను. అంటే - యీనాటి వరకూ, సంవత్సరంన్నర గడిచినా మరి నాకు కనబడ...

గది తలుపు ఎవరో గట్టిగా కొట్టారు. నా చేతులో నుంచి కలం జారిపోయింది. ఎంతసేపటి నుంచి రాస్తున్నానో ఏమో కళ్లు మంటలెత్తినై. గడియారంవైపు చూశాను - నాలుగైంది. తల దిమ్ముగా ఉంది. యింత రాత్రి వరకూ పడుకోక ఏమి రాస్తున్నానో గుర్తుచేసుకో ప్రయత్నించాను. రాస్తున్న కాయితాలకేసి ఓ మారు చూశాను. క్రమంగా గుర్తుకొచ్చింది. ఓ విషాద కథ రాస్తున్నాను. మిత్రుడు విశ్వనాథాన్ని గురించి....

తలుపు గట్టిగా కొట్టిన ధ్వని. పెద్దగా కేక. విసుగ్గా వెళ్ళి తలుపు తెరిచాను.

"యిప్పటి వరకూ ఏం చేస్తున్నావ్? దీపం వెలుగుతూనే వుంది!"

నేను అలాగే ఉండిపోయాను. కల మాత్రం కాదని గుర్తుచేసుకుంటున్నాను.

"మిత్రున్ని మరిచిపోలేదు గదా? అలా నుంచుంటావేం! వెనక దమయంతి వస్తోంది. ఊఁ! లోపలికి"

ఆ నిమిషంలో యిది కలేమో అన్న అనుమానం కలిగింది. అయినా ఆలోచించదలుచుకోలేదు. కలలో ఆలోచించేదేమిటి!

"నమస్తే!"

స్త్రీమూర్తి! నాకు షేక్‌హ్యాండ్ యిచ్చింది.

పది నిమిషాల తరవాత అంతా యదార్థమని నమ్మగలిగాను. రాసినంతవరకూ ఆపి, ఆ విషాద కథను డ్రాయరులోకి తోసేశాను.

అరగంట తరవాత అడిగాను - "ఏంరా విశ్వం! ఏమిటిదంతా?"

విశ్వనాథం నిండుగా, రూము చక్కలూ ముక్కలూ అయేట్టుగా నవ్వాడు.

"దమయంతితో మన వివాహమై రెండు నెల్లయింది. మద్రాసు కాపురం పెట్టేస్తున్నాం. వెళుతూ దారిలో నిన్నోమారు చూసేందుకు దిగాం"

"ఎలా సాధ్యమైంది?"

విశ్వనాథం మళ్లీ అంత పెద్దగానూ నవ్వాడు.

"నీకు అప్పుడే చెప్పాను. ప్రేమకు ఏవీ ఆటంకం కాదని"

"నిన్ను ఏ పిచ్చాసుపత్రిలో పట్టుకున్నది?"

"ఛా! అలాంటిదేమీ జరగలేదు. మనమే వెతికి పట్టుకున్నాం. ఆ మధ్య మన అదృష్టం చుక్కల్ని తాకిందిలే!"

"ఏం జరిగింది?"

"జరగడం చాలా జరిగింది. మనం యిప్పుడు లక్షాధికార్లం. వ్యాకరణ యుక్తం కాకపోయినా

అనవలసింది - రెండు-లక్షాధికార్లం అని"

నాలో ఆశ్చర్యం చప్పున హిమాలయ పరిమాణాలలో పెరిగింది. విశ్వనాథం దమయంతిని ఎలా వివాహం చేసుకోగలిగాడా అన్నదాని కన్న - వాడు రెండు లక్షలు ఎలా సంపాయించగలిగాడా అన్నదే నాకు ఆశ్చర్యాన్నీ, కుతూహలాన్నీ కలిగించింది. మనం కోరిన స్త్రీని పొందగలగడం మరో ప్రపంచంలోనైనా సాధ్యం కావొచ్చు. కాని, కోరినంత ధనాన్ని ఎక్కడా పొందలేం!

"ఎలా సంపాయించావ్?"

"డబ్బునా? దమయంతినా?"

"డబ్బు"

విశ్వనాథం నా భుజం పట్టుకుని దగ్గిరకు లాక్కుని, చెవులో అన్నాడు.

"అందరితో అనవోక, అదృష్టం మనల్ని ఎలక్ట్రిక్ షాక్‌లా తాకింది. కొద్దిలో చెప్పేస్తాను. టిక్కెట్టు లేనప్పుడు థర్డ్‌క్లాస్‌లో కన్న ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణం చేయడం క్షేమమని నీకు తెలుసు గదా? అలా పూనా, బాంబేల మధ్య రాత్రి ప్రయాణంలో, నిదరపోతూన్న ఓ గుజరాతీ వాడి సూట్ కేసు తీసుకొని ఒక చిన్న స్టేషన్‌లో దిగేశాను. తరవాత తెరిచి చూస్తే, అన్నీ నోట్ల కట్టలు! రెండు లక్షల మూడు వందల అరవై రెండు రూపాయిలూ, కొన్ని రాగి కాన్లూ. అదీ అసలు లెక్క -"

నాకు సంతోషంతో నవ్వాలనో - అసూయతో యాడవాలనో - ఏదో గుండెల్లో కదిలింది. ఏదీ చేయలేక - చివరకి చిన్న అనుమానం కలిగి అడిగాను.

"యీ సంగతి దమయంతికి తెలుసా?"

"ఏ సంగతి?"

"డబ్బు యిలా దొంగ..." - మాట జారకుండా ఠక్కున పెదాలు మూశాను.

"ఇందులో పెద్ద దొంగతనం ఏముంది?"

"లేదనుకో! దమయంతికి చెప్పావా?"

"అంతా చెప్పాను. విన్న తరవాత భోరున ఏడ్చింది. మీ ప్రేమని యింత దారుణ పరీక్షకు గురిచెయ్యవలసింది కాదన్నది. ప్రాయశ్చిత్తంగా తను ఆజన్మ బ్రహ్మచారిణిగా వుండిపోతాననీ, తీర్థాలు సేవిస్తాననీ గోల చేసింది. నేనే పట్టి బలవంతాన ఎలాగైతే దారికి తెచ్చాను-"

నేనేదో అనబోయాను. యింతలో పక్క వసారాలో పడుకున్న దమయంతి ఏదో కలవరింతలోలా అస్పష్టంగా అన్నది.

విశ్వనాథం ఠక్కున లేస్తూ -

"పిచ్చిపిల్ల! నిదరలో కూడా నా గురించిన కలవరింతలే! 'అంతగా మిమ్మల్ని పరీక్షించ వలసింది కాదు!' - ఎంతసేపటికీ యిదే కలవరింత"

నాలో నేను నవ్వుకున్నాను. మాధవరావునీ, కాంతారావునీ మర్చిపోవాలనుకున్నాను.

❋

*(అభిసారిక మాసపత్రిక : డిసెంబరు, 1950)*